మానవాళిని సన్మార్గంలో నడిపిన సేవాలాల్

● సంత్ సేవాలాల్ జయంతిలో నివాళులర్పించిన ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముఠా గోపాల్ ● ఆన సేవలను కీర్తించిన పలువురు ప్రముఖులు



సంత్ సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



కార్యక్రమంలో భాగంగా బంజార మహిళలతో ఎమ్మెల్యే ముఠాగోపాల్, తదితరులు

బోయిన్‌పల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది

అమీర్‌పేట్ ఫిబ్రవరి 15: మానవాళిని సన్మార్గంలో నడిపించేందుకు సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు అనుసరణీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బాపునగర్‌లో జరిగిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా బాపునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిసింగ్‌యాదవ్ ఎమ్మెల్యే తలసానికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజారాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు సేవాలాల్ అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్‌తో పాటు నాయకులు గోపీలాల్ చౌహాన్, అశోక్‌యాదవ్, కూతురు నరసింహ, కట్టా బలరాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆయన బోధనలు ఆచరణీయమని పేర్కొన్నారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా 2014లో ప్రారంభించింది మాజీ సీఎం కేసీఆర్ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, భాస్కర్‌నాయక్, దేవేందర్ నాయక్, ఒబానాయక్, నారాయణనాయక్, రాజు నాయక్, ఆర్.విచానిబాయి, అంజలి, తారిభాయ్, జంకు బాయ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమాజాన్ని సన్మార్గంలో నడవాలని సంత్ సేవాలాల్ అనేక బోధనలు సమాజానికి అందించారని ఎమ్మెల్యే గోపాల్ అన్నారు అన్నారు. బీఆర్ఎస్ ఎస్టీ సెల్ విభాగం సీనియర్ నాయకుడు కళ్యాణ్ ఆధ్వర్యంలో బాగ్లింగంపల్లి నుంచి ర్యాలీగా బీఆర్ఎస్ భవన్‌కు బయలుదేరారు.

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ అని నగర గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్ రెడ్డి అన్నారు. నగర కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థి సేన ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్ సేవాలాల్ జయంతిని గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనులతో పాటు సమాజంలో ఉన్న అందరికీ తన బోధనల ద్వారా చైతన్యపరిచారని అన్నారు. లైబ్రరీ సెక్రెటరీ పద్మజ, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్యా సంజీవనాయక్ హాజరై మాట్లాడారు. సంచార జీవితాన్ని కొనసాగిస్తున్న బంజారా ప్రజలను ఒకేచోట ఉండేలని 'తండాలను నిర్మించిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ప్రత్యేక బంజారా ధర్మాన్ని నిర్మించి తాగుడుకు దూరంగా ఉండాలని జీవ హింస చేయకూడదని స్వీయ ఆర్థిక క్రమశిక్షణ ఆరోగ్య రక్షణ ధర్మ రక్షణ బోధిస్తూ పూర్తి బ్రహ్మచర్యంతో చేసిన త్యాగం మర్చిపోవద్దని విజ్ఞప్తి చేశారు. 2014లో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించింది మాజీ సీఎం కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో నగర గ్రంథాలయం చైర్మన్ ఉపేందర్ రెడ్డి, గ్రంథాలయం కార్యదర్శి పద్మజ, ఐక్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, బాలాకోటినాయక్, ప్రకాష్‌నాయక్, శేఖర్ నాయక్, రవి రాథోడ్, రాజురాథోడ్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొనారు.

మారేడ్‌పల్లి: మహీంద్రహిల్స్‌లో సేవాలాల్ లంబాడి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధర్యంలో సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించారు. మారెమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ చిత్రపటానికి నివాలర్పించారు. బంజార మహిళలు సంప్రదాయ ఆట, పాటలతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ లంబాడి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాంనాయక్, కృష్ణ, శ్రీను, శంకర్, గోవింద్, రామచందర్ పాల్గొన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.డైసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మహా భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్టీ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్‌నాయక్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సేవాలాల్ జీవిత చరిత్రను వివరించారు. జాతి కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహామనిషి సేవాలాల్ అని కొనియాడారు. గిరిజన సమాజమంతా జ్ఞానం వైపు మరలాలని, అది విద్య ద్వారానే సాధ్యమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు, సైఫాబాద్ పీజీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రొ.లక్ష్మణ్నాయక్, ప్రొఫెసర్లు నతానియేల్, చందులాల్, బాలునాయక్ పాల్గొన్నారు.

రాక్ ఆర్టిస్ట్ ఇస్లావత్ వెంకన్న ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. విద్యార్థులు రాజేందర్ నాయక్, గణేశ్నాయక్, చరణ్‌నాయక్, రవినాయక్, కళ్యాణ్‌నాయక్, సందీప్‌నాయక్ పాల్గొన్నారు.

బొల్లారం: కంటోన్మెంట్ న్యూబోయిన్పల్లిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే శ్రీగణేశ్, జయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ కె.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వేడుకల్లో విద్యార్థులు గిరిజన సంప్రదాయ వస్త్రాలు ధరించి నృత్యాలు చేశారు. అనంతరం కన్వీనర్ రమేశ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ గిరిజనుల అభ్యున్నతికి తోడ్పడుతూ, మూఢనమ్మకాలు నిర్మూలించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బానోత్ లల్లు, ఉపాధ్యాయులు ఎ.ఎల్కమ్మ, జేఎం రెబెకా, ఆముక్తమాల్యద, నీలిమ ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్: సంత్ సేవాలాల్ జయంతిని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ బృందం దయానంద్, జానకిరెడ్డి, గగన్ కుమార్, మల్లూరి అనిల్ కుమార్, జగన్ యాదవ్, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షుడు సంజీవ నాయక్, తదితరులు

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుల ఆధ్వర్యంలో...

భోగ్ భండార్ కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు

సైఫాబాద్ పీజీ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సునీత మంజరి

ఓయూ వీసీ నుంచి నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ సునీత మంజరి

ఉస్మానియా యూనివర్సిటీ: సైఫాబాద్ పీజీ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ గా డాక్టర్ సునీత మంజరి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఆమె కెమిస్ట్రీ విభాగానికి చెందినవారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

దూరవిద్య డిగ్రీ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రీవాల్యుయేషన్ కు ఒక్కో పేపర్కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 19వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరు వారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి 21వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

థీసెస్ సమర్పణ గడువును పొడిగించాలి

ఓయూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న పరిశోధక విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని 2018 బ్యాచ్ పీహెచ్డీ విద్యార్థుల థీసెస్ సమర్పణ గడువును పొడగించాలని పరిశోధక విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేన్రెడ్డి, ఓఎస్టీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2018లో ప్రారంభమై 2019 వరకు సాగిందని గుర్తు చేశారు. ప్రవేశాలు పొందిన మరుసటి సంవత్సరమే కరోనాతో రెండేళ్ల విలువైన సమయం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రీ పీహెచ్డీ పరీక్షను 2021లో నిర్వహించారని చెప్పారు. ఫెలోషిప్పు లేకపోవడంతో తమ పరిశోధనను సకాలంలో పూర్తి చేయలేకపోయామని పేర్కొన్నారు. డెడ్లైన్ పేరుతో నిరుపేద, గ్రామీణ పేద విద్యార్థులను మానసికంగా కృంగిపోయేలా చేయొద్దని కోరారు. సంవత్సరం పాటు తమకు గడువు పొడగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నాగరాజు, క్రాంతి, వెంకట్, ప్రణయ్, అరుణ్, రమణ, సునీల్, రాజు, విశేష, రాఘవేంద్రప్రసాద్, ప్రవీణ్, నాగేశ్వరరావు, స్రవంతి, రమేశ్, చందూలాల్ తదితరులు పాల్గొన్నారు.

యువతి చదువుకు మున్నూరు కాపు సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 15: మున్నూరు కాపు పేద విద్యార్థి చదువు కోసం ఆ సంఘం నేతలు ఆర్థిక సాయం అందించారు. సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిమ్మ శంకర్ సహకారంతో విద్యార్థికి రూ.35 వేల చెక్కును అందజేశారు. హనుమంతరావు మాట్లాడుతు సికింద్రాబాద్‌కు చెందిన త్రిష చదువు కోసం ఆర్థిక స్తోమత లేక, సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం సంఘ నాయకులను ఆశ్రయించింది. స్పందించిన సంఘం నాయకులు ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిమ్మ శంకర్ ఎంతో మంది పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని అన్నారు. 15 ఏండ్లు నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రమోద్, రాములు, రాచూరి ప్రదీప్ కుమార్, శ్రవణ్, కృష్ణ చందు, అను, వినోద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుల రిమాండ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15: గంజాయి సేవిస్తున్న 8 మంది యువకులను చిక్కడపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయి, రెండు బైక్లు, 9 సెల్ ఫోన్లు, రూ.12 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం బస్ భవన్ ముందు గల రోడ్డులో గంజాయి తాగడం కోసం పలువురు యువకులు గుంపుగా చేరి, గంజాయి బేరాలు చేస్తుండగా చిక్కడపల్లి పోలీసులు, టాస్క్ ఫోర్స్ బృందం వారిని పట్టుకుని, చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఇన్స్పెక్టర్ బి.రాజు నాయక్ మాట్లాడుతూ గంజాయి సేవిస్తున్న మహమ్మద్ సిద్ధిక్ ఖాన్ (23), మొహమ్మద్ షోయబ్, (25), పీకా జతిన్ (21), మొహమ్మద్. నాజర్ (20), మహ్మద్ సైఫ్ (21) పీక ఆర్య (19), మొహమ్మద్ ఫర్దీన్ (20) శెగ్గరి విఘ్నేష్ (26) అరెస్టు చేసి రిమాండ్ తరలించమని తెలిపారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సేవించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేసీఆర్ పుట్టినరోజు వేడుకలకు సన్నాహాలు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 15: తెలంగాణ సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు జి.పవన్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు పద్మారావునగర్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఫిబ్రవరి 17న పద్మారావునగర్ లో ప్రత్యేకంగా కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అనంతరం భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి బంజారాహిల్స్ లోని తెలంగాణ భవన్ కు వెళ్లి అక్కడ సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగే సంబురాల్లో పాల్గొంటామని ఆయన తెలిపారు. బన్సీలాల్ పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, లంబు శ్రీను, మహేందర్, గజ్జల శీను, వెంకటరమణ, మల్లేశ్, శ్రీరాములు పాల్గొన్నారు.

కల్లుకు బానిసై వృద్ధురాలు ఆత్మహత్యా యత్నం

బొల్లారం, ఫిబ్రవరి 15: కల్లుకు బానిసైన ఓ వృద్ధురాలు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సంధ్యారాణి వివరాల ప్రకారం.. లాల్బజార్ పెరుమాళ్ హాట్స్‌కు చెందిన సులోచన (60) కల్లుకు బానిసై ప్రతిరోజు అతిగా సేవిస్తుంది. అయితే తన కుమారుడు కల్లు సేవించవద్దంటూ కొన్ని రోజులుగా మందలిస్తున్నాడు. శనివారం లాల్బజార్‌లోని కల్లు కాంపౌండ్‌లో కల్లు సేవించి, వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తీసుకుని చిన్నకమేల బస్తీకి వెళ్లే దారిలోని గ్రౌండ్‌లోకి వెళ్లి ఒంటిపై పోసుకుని నిప్పు అంటించుకుంది. ఇది గమనించిన స్థానికులు మంటలు ఆర్పేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సులోచనను అంబులెన్సులో గాంధీ దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్వచ్ఛభారత్ అభియాన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మెయిన్ లైబ్రరీ ఆవరణలో స్వచ్ఛ భారత్ అభియాన్ శనివారం నిర్వహించారు. నెలలో మూడో శనివారం సందర్భంగా ఆవరణ మొత్తం శుభ్రం చేశారు. విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, సందర్శకులకు పరిశుభ్ర విద్యా వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రరీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సంచార ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సైదా ఖాన్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15: సంచర జాతుల ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనితెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం అధ్యక్షుడు సైదా ఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం ఆధ్వర్యంలో శనివారం భాగ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు సైదాఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత దుర్భర జీవితాన్ని ఈ వర్గాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రకాల సంచార వృత్తులను చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న వారికి రాష్ట్రంలో గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తమకు కుల సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ వర్గాలకు గుర్తింపు వస్తుందని తామంతా ఆశించామని, కానీ తమ ఆశలన్నీ అడియాశలయ్యాయని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను కలిసినా కూడా తమను పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించేంతవరకు వివిధ రూపాల్లో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి, కోశాధికారి యాకూబ్, నాయకులు రసూల్, ఇమామ్, రషీద్, అలీ అబ్బాస్, కమల్, గౌస్, నాగుల్ మీర గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఓపిక పట్టుదల ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలి

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కె.శ్రీలత, వేదికపై ప్రతినిధులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 15: బాగ్లింగంపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాలలో సెల్ఫ్ ఎంపైర్మెంట్ ఫర్ సక్సెస్ అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బ్రహ్మకుమారిస్ ప్రతినిధి డాక్టర్ బి.కె శ్రీలత హాజరై మాట్లాడారు. ఓపిక పట్టుదల ధైర్యాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని, అప్పుడే సక్సెస్ అనేది మన వెంట ఉంటుందన్నారు. ప్రతి వ్యక్తి మంచి వ్యక్తిత్వాన్ని కలిగి క్రమశిక్షణను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమములో కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.విష్ణు ప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ మట్ట శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల కోసం ఉద్యమిస్తాం

ముషీరాబాద్, ఫిబ్రవరి15: జాతీయ స్థాయిలో బీసీ హక్కుల కోసం ఉద్యమిస్తామని బీసీ హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లు మహేందర్ తెలిపారు. శనివారం బీసీసంక్షమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన బీసీ సమస్యలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని, సామాజిక అసమానతలు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఫీజు బకాయిలు, బీసీల అభివృద్ధిలో తీరని అన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, భాస్కర్, బోల్లం నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 15: గతంలో మాదిరిగానే రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని ఇండియన్ రైల్వే ఎంప్లాయిస్ కమిటీ ఫర్ మూమెంట్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఐఆర్ఏంఓపిఎస్) జాతీయ అధ్యక్షుడ సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం లాలాగూడ క్యారేజ్ వర్క్ షాప్ వద్ద రైల్వే ఎంప్లాయిస్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్స్ ఆధ్వర్యంలో జరిగిన పాత పెన్షన్ పునరుద్ధరణ ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏదైతే నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్పీఎస్, యూపీఎస్) విధానాన్ని తీసుకువచ్చిందో దాన్ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీంను తిరిగి పునరుద్ధరిస్తే బాగుంటుందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన న్యూపెన్షన్ విధానం ద్వారా లక్షలాదిమంది రైల్వే ఉద్యోగులు నష్టపోతున్నారని ఆయన తెలియజేశారు. పాత పెన్షన్ స్కీంను కేంద్ర ప్రభుత్వం తిరిగి అమలు చేసేంతవరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐఆర్ఎంఓపిఎస్ జనరల్ సెక్రటరీ అమిత్ మలంగి, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌పాండే,మీడియా సెక్రటరీ ప్రవీణ్, జోనల్ జనరల్ సెక్రటరీ అల్ఫేట్ డానియల్, కోశాధికారి శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముఖేష్ మీనా, తదితరులు పాల్గొన్నారు.

నాలాలో పడిన యువకుడికి తీవ్రగాయాలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 15: ఇంద్ర నగర్ కాలనీ నాలాలో యువకుడు ప్రమాదవశాత్తు జారీ పడ్డాడు. తీవ్ర గాయాల పాలైన యువకుడిని స్థానికులు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు ల్లోకి వచ్చింది. స్థానికులు, ఆ కాలనీ అధ్యక్షుడు నగరపు శ్యామ్, నామాల గుండు వీరాంజనేయ స్వామి ఆలయ సభ్యుడు బేతాళ నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. మెడిబావిలో నివాసముండే సురేష్ నిజం కళాశాలలో విధులు నిర్వహిస్తాడు. కాగా శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న క్రమంలో కాలనీలో నాలా పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు పాలయ్యాడు. గమనించిన స్థానికులు అతని వెంటనే అంబులెన్స్‌లో గాంధీ హాస్పిటల్ తరలించారు. ప్రస్తుతానికి చికిత్స పొంది కోలుకున్నట్లు కాలనీ అధ్యక్షుడు శ్యామ్ తెలిపారు. ప్రమాదానికి కారణం కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హాస్టల్ విద్యార్థులపై దాడి

మేడ్చల్, ఫిబ్రవరి 15: ఎస్టీ హాస్టల్ విద్యార్థులపై దాడి జరిగిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఇంజనీరింగ్ చేస్తూ మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటున్న నితిన్‌కు, సీనియర్లకు మధ్య భోజనం విషయంలో శుక్రవారం రాత్రి వివాదం తలెత్తింది. సేవాలాల్ జయంతిపై చర్చ జరుగుతున్నందున కొద్దిసేపు ఆగాలని వారు సూచించారు. ఈ విషయమై చిన్న ఘర్షణ జరిగి వాగ్వివాదం జరిగింది. కాగా నితిన్ అర్ధరాత్రి బయట నుంచి 30మందిని హాస్టల్‌కు పిలిపించుకొని, సీనియర్లపై దాడి చేశాడు. దాడిలో బలవీర్, శ్రీకాంత్, అరుణ్, హరీశ్ తీవ్రంగా గాయపడ్డారు. కాగా, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అరెస్ట్

మలక్‌పేట, ఫిబ్రవరి 15: ఆయుధాలతో సంచరిస్తున్న యువకుడిని చాదర్ ఘాట్ పోలీసులు అరెస్టు చేశారు. చాదర్ ఘాట్ పోలీసులు పాత మలక్ పేట డివిజన్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా, వాటర్ ట్యాంక్ వద్ద మహ్మద్ ఇమ్రాన్ అలియాస్ టక్లా ఇమ్రాన్ పోలీసుల వాహనాన్ని చూసి పారిపోయేందుకు యత్నించాడు. అదుపులోకి తీసుకొని విచారించగా, అతడి వద్ద పౌచ్‌లో చాకు దొరికింది.